ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



సూర్యాపేట

5

శుక్రవారం 27 సెప్టెంబరు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	588.90 (308.7614)	28,253	46,229
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644 (4.29)	4,852.39	4,640.97
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.89 (45.61)	42,689	36,957

చికెన్ ధరలు: లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240

సాఫీగా సాగుతూ...



ఈ నెల 1న కాగితరాంచంద్రాపురం కట్టపై గండిపడిన ప్రదేశం

కాగితరాంచంద్రాపురం వద్ద గండిపూడ్చివేతతో ఎడమకాల్వలో దిగువకు సాఫీగా వెళ్తున్న నీరు

- మునగాల హెడ్‌రెగ్యులేటర్ నుంచి 1,500 క్యూసెక్కులు విడుదల
- నీటిసామర్థ్యం పెంచుతున్న అధికారులు
- కాగితరాంచంద్రాపురం వద్ద పర్యవేక్షణ చేస్తున్న అధికారులు

నడిగూడెం మండలం కాగితరాంచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వపై గండిని అధికారులు పూడ్చివేశారు. కాల్వకు బుధవారం రాత్రి 600 క్యూసెక్కుల నీటిని వదిలిన అధికారులు నీటి ప్రవాహాన్ని, గండి ప్రదేశాన్ని పరిశీలిస్తూ గురువారం సాయంత్రానికి 1,500 క్యూసెక్కులకు పెంచారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పాలేరు రిజర్వాయర్‌కు నీరు చేరాయి. దీంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఒకటి రెండు రోజుల్లో కాల్వకు మరో 1000 క్యూసెక్కులను పెంచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

- హుజూర్‌నగర్

ఎడమకాల్వ మరమ్మతులకు పది రోజులకుపైగా శ్రమిస్తున్న అధికారులు గురువారం నీటి విడుదలను పెంచి పరిశీలించారు. గండిపడిన కాగితరాంచంద్రాపురం వద్ద కట్టకు రక్షణగా 8 అడుగుల ఎత్తు వరకు ఇసుక బస్తాలను ఏర్పాటుచేశారు. సాఫీగా నీరు సాగిపోవడంతో రైతులు ఆనందంలో ఉన్నారు. ఆగస్టు 31, ఈ నెల 1వ తేదీన భారీ వర్షాలకు ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌కు భారీ మొత్తంలో వరద వచ్చింది. అదేసమయంలో సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేశారు. ఒత్తిడి పెరిగి కాల్వలో పాలేరు జలాలు వెనక్కి వచ్చాయి. దీంతో ఈనెల 1న 132వ కిలోమీటర్ కాగితరాంచంద్రాపురం వద్ద, 134వ కిలోమీటర్ ఖమ్మం జిల్లాలోని నాయకన్‌గూడెం సమీపంలో గండ్లుపడ్డాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 15 నుంచి 25 సాయంత్రం వరకు గండ్లను పూడ్చివేశారు. నాయకన్‌గూడెం వద్ద గండి పూడ్చివేత పూర్తికాలేదు. దీంతో సుమారు 10 అడుగుల ఎత్తులో కాంక్రీట్ వాల్ కట్టి దిగువన ఉన్న పాలేరు రిజర్వాయర్‌కు నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం మునగాల హెడ్‌రెగ్యులేటర్ 1,500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

మొదటి జోన్ పరిధిలో

ఎడమ కాల్వ మొదటిజోన్‌లోని హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్న ముక్త్యాల బ్రాంచ్ కాల్వకు అధికారులు 1,200 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. వాస్తవంగా ఎడమకాల్వలో 5,500క్యూసెక్కుల నీటి సరఫరాకు అవకాశం ఉండగా ఎంబీసీకి 1,800 క్యూసెక్కులు, నడిగూడెం ఎడమకాల్వకు 3,700ల క్యూసెక్కుల నీటిని విడుదల చేసేవారు. కాగా కాగితరామచంద్రాపురం, నాయకన్‌గూడెం వద్ద గండ్లు పడి పూడ్చివేత బుధవారం పూర్తయిన నేపథ్యంలో నీటి సామర్థ్యాన్ని తగ్గించారు. అయితే ముక్త్యాల బ్రాంచ్ కాల్వ పరిధిలో లక్షా 7వేల ఎకరాల ఆయకట్టు ఉండగా జిల్లా మొత్తంలో 2.25 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇదిలా ఉండగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 6 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా ఎడమకాల్వలో పరిధిలో 10.20 లక్షల ఎకరాల ఆయకట్టు విస్తరించి ఉంది.

జిల్లాలోని మునగాల హెడ్‌రెగ్యులేటర్ 115వ కిలో మీటర్ నుంచి జిల్లాలో సుమారు 60వేల ఎకరాల ఆయకట్టు విస్తరించి ఉండగా కాల్వకు గండిపడిన నేపథ్యంలో 50వేల ఎకరాల్లోని రైతులు ఇబ్బందులుపడ్డారు. మునగాల రెగ్యులేటర్ నుంచి జిల్లా పరిధిలో కొత్తగూడెం, కొమరబండ, పాలారం మేజర్లతో ఈశ్వమాదారం-1, ఈశ్వమాదారం-2 మేజర్లు, రామచంద్రాపురం యూటీ పరిధిలో 40వేల ఎకరాల ఆయకట్టు ఉంది. వీటితో పాటు మునగాల, నడిగూడెం మండలాల్లో ఎనిమిది ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. కాగా 132వ కిలోమీటర్ వద్ద గండి పడిన నేపథ్యంలో మట్టికట్ట(క్రాస్‌బండ్) వేసి ఎత్తిపోతల కింద సుమారు 20 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. మునగాల హెడ్‌రెగ్యులేటర్ నుంచి 128వ కిలోమీటర్ వరకు ఐదు రోజుల పాటు నీటిని విడుదల చేసి కొత్తగూడెం, కొమరబండ, పాలారం మేజర్లు, కొన్ని ఎత్తిపోతలకు సాగునీటిని అందించారు. కాగా బుధవారం సాయంత్రం మట్టికట్ట తొలగించిన అనంతరం నాయకన్‌గూడెం 134వ కిలోమీటర్ మీదుగా దిగువకు నీరు విడుదల చేశారు.

గండ్లపూడ్చివేతకు రూ.2.5 కోట్లు

వరదలకు ఎడమకాల్వకు రెండుచోట్ల గండ్లుపడిన నేపథ్యంలో ఈ నెల 15 నుంచి పనులు ప్రారంభించిన అనంతరం 11 రోజుల్లో పనులు పూర్తిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిధుల విడుదల అనంతరం యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేసిన అధికారులు రైతుల పంట పొలాలకు సాగునీరు సరఫరా చేయడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు రూ.2.5 కోట్లతో ఎడమ కాల్వకు గండ్లతో పాటు ఎంబీ కెనాల్‌కు పడిన గండ్లను పూడ్చారు. దీంతో మొదటిజోన్ పరిధిలోని బ్రాంచ్‌కెనాల్ ఎడమ కాల్వ రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఎడమ కాల్వకు నీటి సామర్థ్యం మరింత పెంచుతామని అధికారులు తెలిపారు.



కాగితరామచంద్రాపురం వద్ద ఎడమ కాల్వ కట్ట తెగి వరదకు పొలాల్లో వేసిన ఇసుక మేటలు

కడ'గండ్లు' మిగిల్చిన వరద

హుజూర్‌నగర్, సెప్టెంబరు 26 : ఇటీవలి భారీవర్షాలు, వరదలతో నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు గండ్లు పడి రైతులకు కన్నీళ్లు మిగిల్చాయి. గండ్లు పడి కాల్వకు 23 రోజులుగా నీటి రాక నిలిచి ఆందోళనలో రైతులు ఓ వైపు ఆనందం వ్యక్తం చేస్తుండగా, గండ్ల పడిన ప్రదేశాల్లో పొలాలు ఇసుక మేటలు వేసి ఆందోళన చెందుతున్నారు. సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని కాగితరాచంద్రాపురం వద్ద ఈ నెల 1న కాల్వకు గండి పడగా వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. పాలేరు రిజర్వాయర్ నిండి వరద నీరు వెనక్కి రావడంతో కాగితరామచంద్రాపురం వద్ద గండిపడింది. కొత్తగూడెం, గోండ్రియాల, వల్లాపురం, శాంతినగర్, పాలారం, చనుపల్లి, కిష్టాపురం, శీతలితండా, రాజంపేట, ఈశ్వరమాదారం, కాగితరామచంద్రాపురం ప్రాంతాల్లోని సుమారు నాలుగు వేల ఎకరాలకు పైనే పొలాలకు తీవ్రనష్టం వాటిల్లింది. పాలారం, శాంతినగర్ ప్రాంతాల్లోని వాగు ప్రాంతంలో వరద నీటిలో పంటపొలాలు చిక్కుకున్నాయి. ముఖ్యంగా కోదాడ నియోజకవర్గంలోని నడిగూడెం, అనంతగిరి, కోదాడ, మోతె మండలాల పరిధిలోని వేల ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. కాల్వకు గండ్లు పూడ్చినా పంట నష్టపోయిన తమకు ఎలాంటి పరిహారం అందలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.



నష్ట పరిహారం అందించాలి

సాగర్ ఎడమ కాల్వ కట్ట తెగి తీవ్ర పంటనష్టం జరిగింది. ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నష్టపరిహారం అందించలేదు. అధికారులు సర్వే చేసినా మేలు జరగలేదు. మండలంలో పూర్తిస్థాయిలో సర్వే చేసి నష్టపరిహారం అందించాలి.

రవీందర్‌రెడ్డి, రైతు, కాగితరామచంద్రాపురం

నవసమాజం కోసం పోరాడిన ఐలమ్మ



ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సామేల్, పక్కన కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్

సూర్యాపేట(కలెక్టరేట్)/ సూర్యాపేట టౌన్, సెప్టెంబరు 26 : నవ సమాజం కోసం పోరాడి గెలిచిన మహిళ చాకలి ఐలమ్మ అని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. ఐలమ్మ జయంతిని సందర్భంగా కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమాన్ని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా పోరాటాలకు నిలయమని, దొరల నియంతృత్వ పాలన అంతమొందించేందుకు వీరులను కన్నబిడ్డ ఈ ప్రాంతమన్నారు. ఆనాటి త్యాగధనుల ఫలితమే నేటి తరం అన్నిరకాలుగా అనుభవిస్తోందని స్పష్టం చేశారు. ప్రజల విన్నపం మేరకు హైదరాబాద్‌లోని కోఠిలోని మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టారని తెలిపారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రజలందరినీ ఐక్యం చేసి దొరలపై పోరాడుతూ విజయం సాధించిన గొప్ప పోరాటయోధురాలు అన్నారు. ఐలమ్మ చూపిన తెగువ, శౌర్యం, ధైర్యం ప్రతి ఒక్కరిలో ప్రేరణ కలిగించిందన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని 42వార్డులో ఐలమ్మ జయంతి సందర్భంగా రజక సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, వివిధ శాఖల అధికారులు శంకర్, లత, దున్న శ్యాం, రజక సంఘం నాయకులు సట్టు నాగయ్య, ఉపేందర్, శ్రీనివాస్, రాచూరి ప్రతాప్, మాచర్ల అచ్చయ్య, నిమ్మల శ్రీనివాస్, భూతరాజు శైలజ, శివ, సైదులు, నిర్మల, చంద్రయ్య, సైదులు, ఆదర్శయూత్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి



సమావేశంలో కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్, పక్కన ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 26 : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్‌లో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌తో కలిసి నిర్వహించిన రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రధాన జాతీయరహదారులపై తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని వాటికి ఆస్కారం లేకుండా అన్నిచర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గుర్తించిన 37 బ్లాక్‌స్పాట్లలో 22ప్రదేశాలు నేషనల్ హైవే అథారిటీ పరిధిలోకి వస్తాయన్నారు. మిగిలిన ప్రదేశాల్లో రవాణా శాఖాధికారులు ఎన్‌హెచ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదిక అందజేయాలన్నారు. జిల్లాలో ప్రమాద పరిష్కార బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అందులో ఒక పోలీస్ అధికారి, ఒక ఎంవీఐ, ఎన్‌హెచ్ అధికారి, ఆర్అండ్‌బీ అధికారి, ఆర్టీసీ డిపో మేనేజర్, పంచాయతీరాజ్ అధికారి, మునిసిపల్ కమిషనర్, మండల స్థాయి అధికారులు కలిసి రోడ్లను పరిశీలిస్తూ నివేదికను అందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఎన్‌హెచ్(365)అధికారి రాహుల్, ఎన్‌హెచ్(65) అధికారి రాధేశ్యాంషైనీ, నాగక్రిష్ణ, పీఆర్ ఈఈ మాధవి, ఆర్డీవో వేణుమాధవ్, మునిసిపల్ కమిషనర్లు శ్రీనివాస్, రమాదేవి, శ్రీనివాసరెడ్డి, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ శ్రీనివాసరావు, ఆర్టీవో సురేష్‌రెడ్డి, ఎన్‌హెచ్ ఈఈ ప్రవీణ్‌రెడ్డి, పీఆర్ ఈఈ వెంకటయ్య, డీఎంహెచ్‌వో కోటా చలం, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 26 : ఐదేళ్లలోపు చిన్నారులను సంపూర్ణ ఆరోగ్యవంతులను చేసేందుకు ఏర్పాటుచేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన పోషణ్ అభియాన్, ప్రాజెక్టు లెవల్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజ భవిష్యత్‌లో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర కీలకమన్నారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసంతో పాటు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉత్తమ సేవలు అందించిన టీచర్లకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమఅధికారి నర్సింహా రావు, ఐసీడీఎస్ సీడీపీవో సుబ్బలక్ష్మి, సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

పేటలో హైడ్రా హడల్



సర్వే చేస్తున్న అధికారులు

జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు ఒకప్పటి బేచిరాగ్ మాదారం గ్రామం, సూర్యాపేట పట్టణ రెవెన్యూ పరిధిలోని 268 ఎకరాల్లో విస్తరించి ఉంది. సర్వే నెంబర్లు 244, 245, 246, 248, 254, 256, 257, 258, 264, 266, 267, 800, 787, 788, 789, 790, 795, 796 వీటితో పాటు మరి కొన్ని సర్వే నెంబర్లలో చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లు ఉన్నాయి. వీటి పరిధిలోనే నిర్మాణాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

- మూడు రోజుల సద్దులచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఇళ్ల సర్వే
- ఆందోళనలో స్థానికులు

భానుపురి, సెప్టెంబరు 26 : హైదరాబాద్‌లో అక్రమ కట్టడాల కూల్చివేతలతో హడలెత్తిస్తున్న హైడ్రా సూర్యాపేట మునిసిపాలిటీ ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. హైడ్రా తరహాలోనే ఇక్కడ కూడా కూల్చివేతలు చేస్తారేమోనన్న ఆందోళన చెరువు పక్కన ఫుల్‌ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్)లో నివాసముంటున్న ప్రజల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. మునిసిపాలిటీల్లో సైతం చెరువుల ఆక్రమణలను తొలగిస్తామని ప్రభుత్వం హెచ్చరించడంతో ఆందోళన తీవ్రమైంది. చెరువు సమీప కుటుంబాలు ఇటీవల వినాయకచవితి పండుగను సైతం ప్రశాంతంగా చేసుకోలేదంటున్నారు. జిల్లాకేంద్రంలో సద్దుల చెరువు, పుల్లారెడ్డి చెరువులు ఉన్నాయి. వీటి ఎఫ్‌టీఎల్ పరిధిలో కొన్నేళ్లుగా నిర్మాణాలు చేపట్టారు. ఇన్నాళ్లు ధైర్యంగా ఉన్న వారంతా నెలరోజుల నుంచి నిద్ర పట్టడం లేదంటున్నారు. 40ఏళ్ల నుంచి ఉంటున్నా అధికారుల బృందం సర్వేకు వస్తుండటంతో ఉలిక్కిపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని సద్దులచెరువు చుట్టుపక్కల 13, 14, 28, 29, 30, 41, 42, 43 వార్డుల ప్రజలు కొంత భాగం నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. ఎక్కువభాగం 43, 30, 42 వార్డుల్లోని ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. సుమారు 2,000 ఇళ్ల వరకు ఉంటాయంటున్నారు. హైటెక్ బస్టాండ్, నెహ్రూనగర్, మందుల బజార్, శ్రీశ్రీనగర్, ఇందిరానగర్, మానసనగర్, ఏవీ ఎన్‌క్లేవ్, హైటెక్ బస్టాండ్, జేజేనగర్, చాకలిబజార్, నిర్మల ఆసుపత్రి వెనుక భాగం, తాళ్లగడ్డ, జనగాం రోడ్డు వైపు చెరువు చుట్టూ అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. సూర్యాపేట ఆర్డీవో ఆదేశాల మేరకు మూడు రోజుల నుంచి నీటిపారుదల, రెవెన్యూ, మునిసిపాలిటీ, సర్వేయర్ల బృందం ఇంటింటిని గుర్తిస్తూ వివరాలను సేకరిస్తున్నారు. గురువారం 43 వార్డులోని నెహ్రూనగర్, మందులబజార్, ఇందిరానగర్ ప్రాంతాల్లో అధికారులు పర్యటించి వివరాలు సేకరణలో ఉండగా స్థానికులు అడ్డుకున్నారు. 247 సర్వే నెంబర్‌లో 268 ఎకరాలు ఉండగా చెరువు అక్రమణకు గురికావడంతో పరిధి తగ్గిపోయింది. కొన్నేళ్ల కిందటే సద్దులచెరువు కట్టను నిర్మించి మినీట్యాంక్ బండ్‌గా మార్చారు. ఇంకా నల్లచెరువు, పుల్లారెడ్డిచెరువు చుట్టూ సైతం కబ్జాలు భారీగా ఉన్నట్లు స్థానికలు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సూర్యాపేటలోని సద్దలచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో అక్రమ కట్టాడాలు ఎన్ని ఉన్నాయని సర్వే చేస్తున్నామని సూర్యాపేట నీటిపారుదల శాఖ డీఈ రమేష్ తెలిపారు.



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నెహ్రూనగర్, మందులబజార్ కాలనీవాసులు

సర్వేను అడ్డుకున్న ప్రజలు

జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు ఎఫ్‌టీఎఫ్, బఫర్‌జోన్లలోని ఇళ్ల సర్వే కోసం గురువారం వెళ్లిన అధికారుల బృందాన్ని 43వ వార్డులోని నెహ్రూనగర్, మందులబజార్‌కు చెందిన స్థానికులు అడ్డుకున్నారు. నీటిపారుదల శాఖ ఏఈ పాండునాయక్, డిప్యూటీ తహసీల్దార్ స్వప్న, ఆర్ఐ శ్రీధర్, మునిసిపాలిటీ అధికారులు గౌస్ ఖాన్, సర్వేయర్ శ్రీనివాస్‌లతో పాటు సూపర్‌వైజర్లు బాలాజీనాయక్, నరేష్‌లు సర్వేకు వెళ్లారు. మూడ్రోజుల నుంచి కొనసాగుతున్న గుర్తింపు సర్వేను గురువారం అడ్డుకోవడంతో అధికారులు వెనక్కు తిరిగి వెళ్లిపోయారు. అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి రోజు 70, రెండోరోజు 80, మూడోరోజు 46 ఇళ్లను గుర్తించారు. చెరువులో ఎక్కెడెక్కడ నిర్మాణాలు ఉన్నాయో గుర్తించాక నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. అధికారులు, ఇతరులు రేపటి నుంచి ఎవరు సర్వేకొచ్చినా ఇబ్బందులు తప్పవని స్థానికులు హెచ్చరించారు.

భర్త చనిపోతే వచ్చిన డబ్బులతో ఇల్లు కట్టా



నా భర్త చనిపోతే వచ్చిన డబ్బులతో ఇల్లు కట్టా. ఇంటికి అన్ని అనుమతులు ఉన్నాయి. ఇంటిని కూల్చితే నేను, నా కొడుకు తట్టుకోలేం. ప్రభుత్వం పేదల గురించి ఆలోచన చేయాలి. అధికారులు ఇబ్బందులు పెట్టొద్దు.

గుండ్ల సంతోషి, ఇందిరానగర్

అమ్మానాన్నల రెక్కలకష్టం



కొత్తబస్టాండ్ వద్ద శనగకాయలు అమ్ముకుని జీవిస్తుంటాం. అమ్మానాన్న రెక్కల కష్టంతో ఇంటిని నిర్మించారు. ముగ్గురు అక్కలు, నన్ను సాకుతున్నారు. ఇల్లుపోతే తట్టుకోలేం. ప్రభుత్వం ఆలోచనను వెనక్కి తీసుకోవాలి.

- దాసరి నవీన్, నెహ్రూనగర్

పలుచోట్ల భారీ వర్షం

పెన్‌పహాడ్, సెప్టెంబరు 26 : పెన్‌పహాడ్ మండలంలో బుధవారం రాత్రి, గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. పోట్లపహాడ్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణ మొత్తం నీరుచేరింది. దీంతో విద్యార్థులు పాఠశాల్లోకి వెళ్లేందుకు ఇబ్బందిపడ్డారు. నాగులపాటిఅన్నారం గ్రామంలో చెరుపల్లి కృష్ణయ్య-నీలమ్మ దంపతులకు చెందిన రెండు గదుల రేకుల ఇల్లు గోడ వర్షానికి కూలింది. పెన్‌పహాడ్‌లో గొలకుంట చెరువు అలుగుపోస్తోంది. పలుచోట్ల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.



నాగులపాటిఅన్నారంలో కూలిన ఇంటిగోడ



నూతన్‌కల్: బుధవారం రాత్రి భారీ వర్షానికి అలుగు పోస్తున్న గుండ్ల సింగారం కత్వ

వయోవృద్ధులకు క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడలను ప్రారంభిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 26 : వయోవృద్ధులకు క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వివేకానంద వృద్ధాశ్రమంలో అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల సందర్భంగా క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. వృద్ధులు తమకు ఎవరూలేరని కలత చెందవద్దని, మీవెంట తామంతా ఉన్నామన్నారు. పిల్లలు తల్లిదండ్రులను రక్షించుకోవాలన్నారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, తల్లాడ కృష్ణమూర్తి, బండి శ్రీనివాస్, కొత్త మల్లికార్జున్ పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్య విరుద్ధం: జూలకంటి

నూతనకల్, సెప్టెంబరు 26 : దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ ప్రజాస్వామ్య విరుద్ధమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చిల్పకుంట్ల గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచం ఎర్రజెండా వైపే చూస్తోందని, దానికి నిదర్శనమే శ్రీలంకలో ఎర్రజెండా విజయమన్నారు. నరేంద్రమోడీ దేశంలో జమిలి ఎన్నికల పేరిట నియంతృత్వం తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. జమిలి ఎన్నికలకు సీపీఎం వ్యతిరేకమన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడతామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, కొలిశెట్టి యాదగిరిరావు, పులుసు సత్యం, కందాళ శంకర్‌రెడ్డి, తొట్ల అచ్చయ్య, బొజ్జ శ్రీనివాస్, బొత్తల లింగయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. .

నిండా మునిగిన రైతులు

● ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి, మిర్చి పంటలకు నష్టం ● మేళ్లచెర్వు మండలంలో 17 వేల ఎకరాల్లో సాగు


ఎండిపోయిన పత్తి చేను

మేళ్లచెర్వు, సెప్టెంబరు 26: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నల్ల రేగడి నేలల్లో సాగు చేసిన పత్తి, మిర్చి రైతులు నష్టపోయారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలవ్యాప్తంగా 15వేల ఎకరాల్లో పత్తి, రెండు వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. మొత్తం నల్లరేగడి భూమి కావడంతో వర్షాలకు అధిక మొత్తంలో నీరు నిలిచి భూమిలోకి ఇంకిపోవడంతో పాటుగా వర్షపు నీరు పొలాల్లో నిల్వ ఉండటంతో మిట్టపంట అయిన పత్తి పంట నీరు నిలిచి ఉన్న చోట పండుబారి ఎండిపోగా తేమ ఉన్న పొలాలో పూత, పిందె రాలి వట్టి ఆకులు, కొమ్మలు మాత్రమే మిగిలాయి. సాధారణంగా పత్తిపంట రసం పీల్చే పురుగుల భారీ నుంచి కాపాడుకునేందుకు బీ టీ రకం పత్తి విత్తనాలను విత్తుతారు. కాగా పత్తి మొక్కపై బీటీ ప్రభావం వంద నుంచి 120రోజులు వరకు ఉంటుంది. పత్తి మొక్క విత్తిన 45రోజుల్లో గూడ, పూత, పిందె, దశకు చేరుకొని వంద రోజుల్లో దాదాపు 80శాతం పంట రావాల్సి ఉండడం సాధారణంగా జరిగే ప్రక్రియ. కాగా ఈ సీజన్లో సకాలంలో వర్షాలు కురవడంతో జూన్ మొదటి వారంలోనే పత్తి విత్తనాలు నాటడంతో సెప్టెంబరు చివరి వారానికి పత్తి విత్తి వంద రోజులు పూర్తి అయింది. దీంతో పత్తిలో కీటకాలను ఎదుర్కొని బీటీ శక్తి నశించిపోయింది. కాగా ప్రస్తుత పరిస్థితిలో పూర్తిగా కాసి వుండాల్సిన చేన్లు అధిక వర్షాలకు పూత, కాయలు రాలి వట్టి చెట్లుగా నిలిచాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. మండల వ్యాప్తంగా పూర్తిస్థాయిలో నష్టం జరిగింది. అధికారులు మాత్రం నామమాత్రపు తనిఖీలు నిర్వహించి మండలవ్యాప్తంగా కేవలం 170 ఎకరాలు మాత్రమే నష్టపోయిందని పూర్తిగా ఎండిపోయిన పంట పొలాలో కొన్నింటిని మాత్రమే ఎంపిక చేయడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతు న్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు మండలంలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు.

ఎదగని మిర్చి పంట

మండల వ్యాప్తంగా ఇటీవల కురిసన వర్షాలకు మిర్చి పంట ఎదుగుదల లేకుండా పోయింది. సెప్టెంబరు చివరి వారంలో పూర్తిగా ఎదిగి పూత దశలో ఉండాల్సిన మిర్చి నాటిన రోజు ఉన్నట్లుగానే ఒక్క వుల్లతోనే జీవచ్ఛవంలో ఉంది. వేలకు వేలు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిన రైతులు అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయారు. తెగుళ్లు, పురుగుల ఉదృతికి గతంతో పోల్చితే పంట విస్తీర్ణం మండల వ్యాప్తంగా తగ్గిపోగా అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ మిర్చి ఎదిగే పూత, పిందె వచ్చే సమయానికి నల్లి, ముడత, పేనుబంక తెగుళ్ల వచ్చి పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతాయని, జనవరికి ముందుగానే పంట వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది.

పూత, కాయలు రాలిపోయాయి

గత సంవత్సరం కాలం కానప్పుడే రైతుల పరిస్థితి బాగుండేది. ఆరు ఎకరాల పత్తి మూడు ఎకరాల మిర్చి వేశా. పత్తి ఎకరానికి రూ.35 వేలు, మిర్చి ఎకరానికి రూ.50 వేలు, సెప్టెంబరు మొదటి వారానికి ముందే పెట్టా. కౌలు కాక రూ.3 లక్షల 50 వేల పెట్టుబడి అప్పు తెచ్చి పెట్టా. ఇప్పుడు పత్తిచెట్లు పూర్తిగా పూతలు, కాయలు రాలిపోయాయి మిర్చి ఎండిపోయే దశలో ఉందని అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పరిశీలనకు రాలేదు.

● పత్తి రైతు సుంకరి హనుమంతు, మేళ్లచెర్వు.

నిండామునిగిపోయాం

అప్పు తెచ్చి కౌలుకు నాలుగు ఎకరాలు పత్తి వేశామని ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పూర్తిస్థాయిలో నష్టం వాటిల్లిందని వట్టి చెట్లే మిగిలాయి. ఇప్పుడు ఉన్న పరిస్థితిలో అట్టి పత్తి చేళ్లకు మళ్లీ మొదట నుంచి మందులు వాడిన ప్రయోజనం ఉండదని ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. ప్రభుత్వం సరైన సలహాలు, సూచనలు చేసి అయినా రైతులను ఆదుకోవాలి. ప్రభుత్వం పంట నష్టం అంచనా వేయాలి.

● అప్పిరెడ్డి, రైతు

శాస్త్రోక్తంగా నిత్య పూజలు


అలంకారమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 26: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రధానాల నైరుతి దిశలో ప్రాకార మండపంలో ఉత్తవ మూర్తులకు పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభర ణాలు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపం లో అధిష్టింపజేసి విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు నిర్వహిం చారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాలను అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాల యంలో స్వామిఅమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయరీతిలో జరిగాయి. శివాలయంలో శ్రీపర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహ వనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు రూ.7,25,882ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

సాగర్ నీటిమట్టం 588.90 అడుగులు


నిండుకుండలా నాగార్జునసాగర్ ప్రాజెక్టు

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, సెప్టెంబరు 26: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం గురువారం సాయంత్రం 588.90 అడుగులుగా ఉంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 588.90 అడుగులు (308.7614టీఎంసీలు)గా ఉంది. ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి 28,253 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతుండగా, సాగర్ నుంచి 46,229 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

మూసీకి పెరిగిన ఇన్‌ఫ్లో..

ఎగువ మూసీ నది పరీవాహక ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఐదారు రోజులుగా ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఇప్పటికే ప్రాజెక్టు 645 అడుగుల గరిష్ఠ స్థాయికి చేరువలో ఉంది. ఎగువ నుంచి పెరుగుతున్న వరద మేరకు ప్రాజెక్టు 2, 3, 7 నెంబర్ క్రస్టుగేట్లను రెండు అడుగుల మేర ఎత్తి దిగువ మూసీకి వదులుతున్న ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు గురువారం 8వ నెంబర్ క్రస్టు గేటును అడుగు మేర ఎత్తారు. ఎగువ ప్రాంతాల నుంచి 4,852.39 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా నాలుగు క్రస్టుగేట్ల ద్వారా 4,326.24 క్యూసెక్కులు, ప్రాజెక్టు కుడి, ఎడమకాల్వల ద్వారా ఆయకట్టుకు 314.73 క్యూసెక్కులు మొత్తం 4,640.97 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 645 అడుగులు(4.46టీఎంసీ)ల నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 644అడుగులు (4.20టీఎంసీ)లుగా ఉంది. కాగా రెండో విడతగా కుడికాల్వకు 48.42 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 266.31 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

'పులిచింతల'కు నిలకడగా వరద

పులిచింతల ప్రాజెక్టుకు వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ప్రాజెక్టు నీటిమట్టం 175అడుగులు (45.77టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి 174.89అడుగులు (45.61 టీఎంసీలు)గా నమోదైంది. ఐదు రోజులుగా ఒక గేటు నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 42,689 క్యూసెక్కులు వరద ప్రవాహం కొనసాగుతుండగా ప్రాజెక్టు అధికారులు ఒక గేటును 2.5 మీటర్లు ఎత్తి 20,957 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 108 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు.

ప్రమాదపు అంచున ప్రయాణం

క్లిక్ క్లిక్




సాగర్ ఎడమకాల్వపై వేములపల్లి ఊర చెరువు సమీపంలో రెయిలింగ్ దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్న వంతెన

సాగర్ ఎడమకాల్వపై నిర్మాణ సమయంలో నిర్మించిన వంతెనలు దశాబ్ధ కాలంగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. రెయిలింగ్ దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. ప్రపంచబ్యాంకు నిధులతో సాగర్ ఎడమకాల్వ ఆధునికీకరణ పనులు చేపట్టినప్పటికీ కాల్వల లైనింగ్ పనులు చేసిన అధికారులు వాటిపై ఏర్పాటు చేసిన వంతెనలను మరమ్మతులు చేయలేదు. శిథిలమై ప్రమాదకరంగా మారడంతో ప్రజలు భయాందోళనల మధ్య వాటిపై రాకపోకలు సాగిస్తున్నారు. సాగర్ ఎడమకాల్వ నిర్మాణ సమయంలో నల్లగొండ జిల్లా వేములపల్లి ఎల్-13, ఊరచెరువు సమీపంలో, అదేవిధంగా రావులపెంట శివారులోని పాలేరువాగు, మూసీల వద్ద ఈటీలపై తదితర ప్రాంతాలపై ఎడమవైపు బ్రిడ్జీలు నిర్మించారు. వంతెనల రైలింగ్‌లు దెబ్బతినడంతో పాటు రక్షణ దిమ్మెలు సైతం శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిపై నుంచే రాకపోకలు కొనసాగుతున్నాయి. ఏ సమయంలో ఏ ప్రమాదం పొంచి ఉందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ వంతెన ద్వారా రాకపోకలు సాగించే సమయంలో ఏ మాత్రం ఆదమరిచినా కాల్వలో పడిపోయే ప్రమా దముంది. ఈ ఇరుకైన వంతెనలను ఆధునికీకరించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని పరిసర రైతులు, వాహనదారులు వాపోతున్నారు. దీనికి తోడు వర్షాకాలంలో కాల్వకట్టలు బురదమయంగా మారడంతో వంతెనలు ఇరుకుగా ఉండడంతో రైతులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఎన్నెస్పీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెనలకు మరమ్మతులు చేపట్టి రైలింగ్, రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● వేములపల్లి

అండర్ పాస్ నిండా నీరు.. వెళ్లలేక ఇబ్బంది



ఇనుపాముల వద్ద-65వ నెంబర్ జాతీయ రహదారిపై నిర్మించిన అండర్ పాస్‌లో నిలిచిన వర్షపు నీటిలో నుంచి వెళుతున్న ద్విచక్ర వాహనదారులు

నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఇనుపాముల వద్ద నిర్మించిన పెడెస్టల్ అండర్ పాస్(పీయూపీ) వంతెన వర్షపు నీటితో నిండిపోయింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వచ్చిన నీటికితోడు ఏఎమ్మార్పీ నీటితో నిండిన స్థానిక నల్లచెరువు అలుగునీరు అండర్‌పాసింగ్ వంతెన కింద చేరుతోంది. వర్షపు నీరు, చెరువు అలుగు నీరంతా అండర్ పాస్ వంతెన వద్ద గల డ్రైనేజీ నుంచి రహదారి అవతలి వైపునకు వెళ్లాలి. రహదారి నిర్మాణ సంస్థ డ్రైనేజీ నిర్మించినా నీరు వెళ్లేలా చేయకపోవడంతో నీరంతా అండర్ పాస్ వంతెన కింద, ఇరువైపులా సర్వీసు రోడ్లపైనే నిలుస్తోంది. దీంతో ఈ అండర్‌పాస్ వంతెన కింద నుంచి నకిరేకల్ పట్టణానికి ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణించాల్సిన మండలంలోని ఇనుపాముల, కొండకిందిగూడెం, బండపాలెం, చెరుకుపల్లి, కేతేపల్లి, కొర్లపహాడ్, చీకటిగూడెం గ్రామాలతో పాటు నకిరేకల్ మండలంలోని మండలాపురం, చందుపట్ల గ్రామాలకు చెందిన వారు ఇక్కడ నుంచే వెళ్తుంటారు. ఈ క్రమంలో అండర్ పాసింగ్ వంతెన కింద, పరిసరాల్లో నిలిచిన నీటితో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి నీరు నిలిచి ఉండడంతో ఆ నీటిలో నుంచే వెళ్లడం కష్టతరమవుతుందని వాహనాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అండర్ పాసింగ్ వంతెన కింద, పరిసరాల్లో నిలిచిన నీటిని ఒకట్రెండు రోజుల్లో తొలగించేలా రోడ్డు నిర్మించిన జీఎమ్మార్ సంస్థ చర్యలు తీసుకునేది. ప్రస్తుతం టోల్ నిర్వహణ బాధ్యతలు ఎన్‌హెచ్‌ఏఐ పర్యవేక్షిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటిని తొలగించే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● కేతేపల్లి.

ఇంటి ఆవరణలో ఆడుకుంటూ..

నీటిసంపులో పడి చిన్నారి మృతి



భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 26: తల్లి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో తన సోదరితో కలిసి ఆడుకుంటున్న చిన్నారి ఇంటి ఆవరణలో ఉన్న నీటిసంపులో పడి మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలో గురువారం జరిగింది. ఎస్‌ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని రాంనగర్ కాలనీలో బీహార్ రాష్ట్రంలోని బాసుదేవ్‌పూర్ బర్ధరకోరికి చెందిన అర్జున్ దాస్ కొంతకాలంగా భార్యాపిల్లలతో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. రోజు కూలీగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగా గురువారం ఉదయం పనికోసం బయటకు వెళ్లాడు. ఇతని కుమారుడు కిరణ్‌కుమార్(13నెలలు) సాయంత్రం 4:30 గంటల సమయంలో ఇంట్లో తల్లి నిద్రిస్తున్న సమయంలో తన సోదరితో ఆడుకుంటూ ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో పడి పోయాడు. అదే ఇంటిలో అద్దెకుంటున్న మరో వ్యక్తి సంతోష్ తన పని ముగించుకుని ఇంటికిరావడంతో నీటి సంపులో తమ్ముడు పడిపోయాడని సోదరి చెప్పడంతో వెంటనే సంపులోకి చూడగా బాలుడు నీటిలో మునిగి చనిపోయి ఉన్నాడు. వెంటనే తల్లికి, పోలీసులకు సమాచారం అందించి మృతదేహాన్ని వెలికితీశారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మృతదేహంతో ఆందోళన



ఇంటి ఎదుట ఉంచిన మృతదేహం

భువనగిరి టౌన్, సెప్టెంబరు 26: అప్పు తీసుకున్న వ్యక్తి అసలుతో పాటు వడ్డీ చెల్లించకపోవడంతో మధ్యవర్తిగా ఉన్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో జరిగింది. భువనగిరి అర్బన్ కాలనీకి చెందిన నిడిగొండ శివప్రసాద్(42) అనే చేనేత కార్మికుడు పట్టణంలో మిర్చి బండి కూడా నడిపిస్తాడు. మధ్య వర్తిగా ఉండి ఒకరికి అప్పు ఇప్పించాడు. అప్పు తీసుకున్న వ్యక్తి వడ్డీ చెల్లించకపోవడంతో కొంతకాలంగా సొంతంగా శివప్ర సాద్ నెలవారీ వడ్డీ చెల్లిస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహంతో కుటుంబసభ్యులు అప్పు తీసుకున్న బంధువు ఇంటి ఎదుట గురువారం నిరసన తెలిపారు. వాగ్వాదం, రోదనలతో పరిసరాల్లో స్వల్ప ఉద్రిక్తత నెలకొ న్నది. అప్పు తీసుకున్న బంధువు సకాలంలో వడ్డీ, అసలు చెల్లించకపోవడం, అదే సమయంలో అప్పు ఇచ్చిన మరో బంధువు వసూళ్ల కోసం తెచ్చిన ఒత్తిడితో మనస్తాపానికి గురై శివప్రసాద్ ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో జరిగిన రాజీ అనంతరం శివశంకర్ మృతదేహాన్ని సొంతింటికి తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు.

పర్యాటక కల ఫలించేనా..?

● అన్నీ ఉన్నా పర్యాటక హబ్‌కు నోచని సూర్యాపేట జిల్లా ● శిథిలావస్థలో కాకతీయుల కళా వైభవం ● పురావస్తుశాఖ అధికారుల నిర్లక్ష్యం



సూరాయపేట మండలం పిల్లలమర్రి గ్రామంలోని శివాలయం

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 26: సూర్యాపేట జిల్లాను టూరిజం కేంద్రంగా మారుస్తామని ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నా అమలుకు నోచుకోవడం లేదు. కొత్త ప్రభుత్వంలోనైనా జిల్లా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందనే ఆశలో ప్రజలు ఉన్నారు. జిల్లాలో అనేక చారిత్రక కట్టడాలు, కాకతీయుల కాలంలో నిర్మించిన దేవాలయాలు, ప్రకృతి రమణీయతను తలపించే ఉండ్రుగొండ గుట్టలు ఉన్నాయి. నాగారం మండలం ఫణిగిరిలో బౌద్ధక్షేత్రం, అర్వపల్లి మండలంలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, ఖాజా నసీరోద్దీన్ బాబాదర్గా, సూర్యాపేట మండలం పిల్లలమర్రి గ్రామంలో కాకతీయుల కాలం నాటి శివాలయాలు, చివ్వెంల మండలం ఉండ్రుగొండలో లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంతో పాటు ఉండ్రుగొండ గిరిదుర్గంలో 13పురాతన దేవాలయాలు చూడ దగ్గ ప్రదేశాలుగా ఉన్నాయి. వీటన్నింటిని కలపి ఒక టూరిజం సర్క్యూట్‌గా ఏర్పాటు చేయాలని 2021 సెప్టెంబరు 19వ తేదీన సూర్యాపేటకు విచ్చేసిన అప్పటి కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి బీజేపీ నాయకులతో పాటు ఉండ్రుగొండ దేవాలయ అభివృద్ధి కమిటి వ్యవస్థాపకుడు డాక్టర్ ఆదుర్తి రామయ్య వినతిపత్రం అందజేసి, వీడియో ప్రజంటేషన్ కూడా చూపించారు. త్వరలో కేంద్ర బృందాన్ని సూర్యాపేటకు పంపిస్తానని హామీ ఇచ్చారు. సూర్యాపేట పర్యాటక కేంద్రంగా మారుతుందన్న ఆశలు చిగురించాయి. రోజులు గడిచినా ఆ దిశగా అడుగులు పడలేదు. సూర్యాపేట జిల్లాలో నాగారం మండలం ఫణిగిరి గుట్టపైన పర్యాటకుల కోసం గెస్ట్ హౌస్, చివ్వెంల మండలం ఉండ్రుగొండలో ట్రెక్కింగ్ సౌకర్యం, రోప్‌వే, రిసార్ట్ నిర్మించాలని, ప్రాజెక్ట్ వర్క్ పూర్తి చేయాలని గత ప్రభుత్వం ఆలోచన చేసిన ఆచరణలో సాధ్యం కాలేదు. ముఖ్యంగా మూసీ ప్రాజెక్టు అనుసంధానం చేసుకొని పార్కులు ఏర్పాటు కళగానే మిగిలింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

ఫణిగిరి బౌద్ధక్షేత్రం అభివృద్ధి ఎప్పుడో?

నాగారం మండలం ఫణిగిరి గ్రామ సమీపంలోని ఏకశిల కొండపై ఉన్న ఫణిగిరి బౌద్ధ క్షేత్రం ఎంతో ప్రసిద్ధమైంది. టిబెట్ దేశానికి చెందిన బౌద్ధులు ఎంతోమంది తరచూ సందర్శిస్తారు. కొండపైన 16ఎకరాల విస్తీర్ణంలో బౌద్ధ క్షేత్రానికి చెందిన ఆరామాలు ఉన్నాయి. ఫణిగిరి బౌద్ధ సంపదకు రక్షణ లేకుండా పోతోంది. తవ్వకాల్లో బయటపడిన బుద్ధుడి విగ్రహం, శాసన పిల్లర్లు ఉన్నాయి. వీటన్నింటినీ పూర్తిస్థాయిలో మ్యూజియంగా ఏర్పాటు చేస్తే బౌద్ధులు పర్యటించే అవకాశముంది. సూర్యాపేట పట్టణానికి 65వ జాతీయ రహదారి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో పిల్లలమర్రి గ్రామం ఉంది. ఎంతో ప్రాశస్త్యం పొందిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయడం లేదు.

పురావస్తుశాఖ అధికారుల నిర్లక్ష్యం

చారిత్రక రామప్ప దేవాలయాన్ని ప్రపంచ వారసత్వ కట్టడంగా(వర్డల్ హెరిటేజ్ సైట్) యునెస్కో గుర్తించింది. కాకతీయ రాజులు అత్యంత సృజనాత్మకంగా, శిల్పకళా నైపుణ్యంతో తెలంగాణలో సృష్టించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపద దేశంలోనే ప్రత్యేక మైనది. క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యానికి గండి పడుతోంది. అరుదైన శిల్పా కళా వైభవంతో పెన్‌పహాడ్ మండలం నాగులపహాడ్ శివాలయంలో అడుగు అడుగునా పురావస్తు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం శిథిలావ్యవస్థకు చేరువైంది. కంపచెట్ల మధ్యన దర్శనమిస్తోంది. భావితరాలకు ఆలయ విశిష్టతను తెలియజేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అరుదైన కాకతీయుల కళా వైభవం మరుగునపడిపోతుంది. గతంలో ఏనాడో టూరిజం హబ్ గా మార్చడం కోసం రూ. 5 కోట్ల కేటాయింపులు జరిపామని చెప్పిన అది పేపర్ల కు పరిమితం కావడంతో ఈ అద్భుత కళా సంపద మరుగున పడిపోయింది.

అసంపూర్తిగా పనులు

ఉండ్రుగొండ గిరిదుర్గం అభివృద్ధి కోసం గత ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఇంకా కొన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సి ఉంది. గుడి వద్దకు వెళ్ళే ఘాట్ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. దీనికి పురావస్తు శాఖ రూ.37 లక్షలు కేటాయించింది. రూ. 6 లక్షలతో 6 కామన్ టాయిలెట్స్ నిర్మాణం పూర్తయ్యింది. సుమారు రూ. 35 లక్షలతో నిర్మించనున్న మినీ ఫంక్షన్‌హాల్ నిర్మాణంలో ఉంది. గుడి ఎదురుగా ఉన్న కోనేరు రివిట్‌మెంట్‌కు రూ.15 లక్షలు కేటాయించారు. దీని పనులు ప్రారంభం కాలేదు. మిషన్ భగీరథ, డ్రిస్ట్రిబ్యూషన్ ప్లాంట్ ఉండ్రుగొండ గుట్టలో ఏర్పాటు చేసి ఫిల్టర్ వేస్ట్ వాటర్‌ను గిరిదుర్గంలోకి వదిలి పచ్చదనాన్ని సంవత్సరమంతా కాపాడాలని ప్రయత్నాలు ప్రారంభం కాలేదు. అలాగే రోప్‌వే, ఎకో-టూరిజం టెంట్స్, ఫారెస్ట్ హట్స్, ఫారెస్టు గెస్ట్‌హౌజ్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన కార్యరూపం దాల్చలేదు.

రూ. 30కోట్లతో కార్యాచరణ



జిల్లాకు రూ.30కోట్లతో పర్యాటక కేంద్ర అభివృద్ధికి కార్యచరణ రూపొందిస్తున్నాం. ముఖ్యంగా ఉండ్రుగొండ, పిల్లలమర్రి దేవాలయం, ఫణిగిరి అభివృద్ధి చేస్తాం. అదేవిధంగా కోదాడ పట్టణంలోని పెద్దచెరువు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే అధికారులతో కూడిన బృందం అధ్యయనం చేసింది. జిల్లాను పర్యాటక కేంద్రంగా రూపొందించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది.

● పటేల్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్.

ప్రతిపాదనలేనా.. రాచ'కొండ'గా మారేనా?

చౌటుప్పల్: రాచకొండ ప్రాంతం సాయుధ పోరాటానికి నిలయం. తర్వాత పీపుల్స్‌వార్ ఉద్యమానికి నిలయంగా ఉండేది. నేటి తెలంగాణకు ఒకనాడు రాజధానిగా విలసిల్లింది. హైదరాబాద్‌కు కూత వేటు దూరంలో ఉన్న రాచకొండ గుట్టలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పాలకులు ప్రయత్నించారు. ఇక్కడ అవసరమైన ప్రభుత్వ భూమి ఉండడం.. దానికి తోడు హైదరాబాద్‌కు అతి దగ్గరలో ఉండడంతో ఈ ప్రాంతంలో వివిధ రకాల ప్రాజెక్టులు ఏర్పాటుకు ప్రభుత్వాలు ప్రతిపాదించాయి. ఈ ప్రాంతంలో పర్యటించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రాచకొండ గుట్టల్లో ఫిలిం సిటీ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. స్పోర్ట్స్‌సిటీ, ఎడ్యుకేషన్ హబ్, స్మార్ట్‌సిటీ, ఇండస్ట్రియల్ కారిడార్ లాంటి ప్రాజెక్టుల ఏర్పాటుపై ప్రతిపాదనలు వచ్చాయి. దశాబ్ద కాలం గడిచిన నేటికీ ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా రాచకొండలో ఫిలిం సిటీ ఏర్పాటుతోపాటు పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఈ ప్రాంతం ప్రజలు కోరుతున్నారు.

రాచకొండను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

రాచకొండ ప్రాంతం పర్యాటకానికి పెట్టింది పేరు. ఇక్కడ కొండలు గుట్టలు సెలయేర్లు పర్యాటకాన్ని తలపిస్తాయి. రేచర్ల పద్మనాయకుల కాలంలో ఇక్కడ నిర్మించిన రాచరిక కట్టడాలు నేటికీ గత వైభవాన్ని చాటి చెబుతాయి. ఇక్కడి దేవాలయాలను నిత్యం



ఎంతోమంది ప్రజలు సందర్శిస్తున్నారు. రాచకొండ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసి ఈప్రాంత్రాన్ని సందర్శించే పర్యాటకుల కోసం మౌలిక సదుపాయాలు కల్పించాలి.

● సూరపల్లి వెంకటేష్ ,రాచప్ప సమితి ప్రధాన కార్యదర్శి

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి



వెంకటేశ్వర్లు(ఫైల్)

త్రిపురారం, సెప్టెంబరు 26: భూ తగాదాలతో మనస్తాపం చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలోని అల్వాలపాడులో గురువారం జరిగింది. ఎస్‌ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ధనావత్ వెంకటేశ్వర్లు(32) తమ బంధువులతో 15సంవత్సరాలుగా భూ పంపిణీలో పంచాయితీ నడుస్తోంది. వారి వేధింపులతో మనస్తాపా నికి గురైన వెంకటేశ్వర్లు ఈ నెల 24వ తేదీన ఇంట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. గమనించిన భార్య అతనిని మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ అదే రోజు మృతిచెందాడు. బంధువులతో చర్చల నిమిత్తం మృతదేహాన్ని రెండు రోజులు మార్చురీలో భద్రపరిచారు. వారి మధ్య రాజీ కుదరకపోవడంతో వెంకటేశ్వర్లు భార్య జ్యోతి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మొక్కు చెల్లించి వస్తూ..



శైలజ మృతదేహం


మాడ్గులపల్లి, సెప్టెంబరు 26: ట్రాక్టర్ ఇంజన్‌పై నుంచి జారిపడి మహిళ మృతిచెందింది. మరో మహిళకు గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కల్వలపాలెం గ్రామ శివారులో పాలేరు వాగు వద్ద గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాములపాడు గ్రామానికి చెందిన 20 మంది కూలీలు రెండు ట్రాక్టర్లలో మండలంలోని సుందర్‌నగర్ వద్ద ఉన్న బంగారు మైసమ్మ ఆలయం వద్దకు వెళ్లారు. మొక్కలు చెల్లించుకొని తిరిగి వస్తుండగా మాడ్గులపల్లి మండలంలోని కల్వలపాలెం పాలేరు వాగు వద్దకు రాగానే రోడ్డుకు అడ్డంగా స్పీడ్ బ్రేకర్ ఉండడంతో ట్రాక్టర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ట్రాక్టర్‌పై ఇంజన్ పై ఉన్న దొంతగాని శైలజ(32), శేషగాని నాగమ్మ కింద పడిపోయారు. తలకు బలమైన గాయాలు కావడంతో శైలజ అక్కడికక్కడే మృతిచెందింది. నాగమ్మకు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో నాగమ్మకు మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శైలజ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. శైలజకు పాప, బాబు ఉన్నారు.

బైక్‌పై ఇంటికి వెళ్తుండగా..

కొండమల్లేపల్లి: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొవడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. మండలంలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన బోడ బలరాం కొండమల్లేపల్లి పట్టణంలోని ఓ కిరాణ దుకాణంలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి పని ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బలరాం కాలికి గాయమైంది. చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

అమ్మ కావాలి.. అమ్మ రావాలి

● తల్లి కోసం తల్లడిల్లిన చిన్నారులు ● కాల్వలో గల్లంతైన శైలజ మృతదేహం లభ్యం ● త్రిపురారంలో విషాదఛాయలు




శైలజ మృతదేహం, తల్లికోసం రోదిస్తున్న చిన్నారులు

నిడమనూరు, సెప్టెంబరు 26: స్నానం చేయించి.. అన్నం తినిపించి.. బుజ్జగించే తల్లి కోసం ఆ ముగ్గురు చిన్నారులు గుక్క పెట్టి ఏడుస్తున్నారు. అమ్మ కావాలి.. అమ్మ రావాలి అని గుండెలవిసేలా రోదించారు. ఆ పిల్లలను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. అమ్మ ఎప్పుడొస్తుందంటూ నాన్నమ్మను అడుగుతుంటే ఏం సమాధానం చెప్పాలో అర్థం కావడం ఆ వృద్ధురాలు నుంచి మౌనమే సమాధానమైంది. పిల్లలను పట్టుకొని ఆమె కూడా కన్నీరుమున్నీరైంది. కన్న తల్లి కోసం ఆ పిల్లలు రోదిస్తున్న తీరు అక్కడున్న ప్రతి ఒక్కరినీ కలిచివేసింది. నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రానికి చెందిన మేదరి శైలజ దుస్తులు ఉతికేందుకు మరో ఇద్దరితో కలిసి బుధవారం సాగర్ కాల్వకు వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతైంది. ఆమె మృతదేహం గురువారం సాయంత్రం త్రిపురారం మండల పరిధిలోని కంపాసాగర్ బ్రిడ్జి సమీపంలో లభ్యమైంది. త్రిపురారంలోని ఇందిరమ్మ కాలనీలో జీవనం సాగించే శైలజ, జానయ్య దంపతులకు అవంతిక(12), అంజలి(10), జ్యోత్స్నప్రియ(8) వయసున్న ముగ్గురు కుమార్తెలు. పెద్ద కూతురు నల్లగొండలోని ఎస్సీ గురుకులంలో ఏడో తరగతి చదువుతుండగా, మిగితా ఇద్దరు త్రిపురారంలో చదువుతున్నారు. భర్త సుతారి పని చేస్తున్నాడు. భర్తకొచ్చే ఆదాయంతో ముగ్గురు పిల్లలను సాకడం కష్టం కావడంతో ఆమె కూడా భర్తకు చేదోడుగా ఉండాలనే తపనతో స్థానికంగా ఓ కూరగాయల దుకాణంలో పని చేస్తుండేది శైలజ. కానీ దుకాణం యజమానికి చెందిన దుస్తులు ఉతికేందుకు బొక్కమంతలపహాడ్ వద్ద ఉన్న సాగర్ కాల్వకు వెళ్లి దుస్తులు ఉతికి పైకి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి నీటిలో కొట్టుకుపోయింది. దీంతో ఆమె ముగ్గురు కుమార్తెలు తల్లి లేని వారయ్యారు.

కంపాసాగర్ వద్ద శైలజ మృతదేహం లభ్యం

కాల్వలో ముగ్గురు గల్లంతు కాగా స్థానికులు ఓ మహిళను రక్షించగా శైలజతో పాటు సాయి నీటిలో కొట్టుకుపోయారు. పోలీసులు గజ ఈతగాళ్లతో కాల్వలో గాలింపు చర్యలు చేపట్టగా ఎట్టకేలకు కంపాసాగర్ బ్రిడ్జి వద్ద శైలజ మృతదేహం లభ్యమైంది. సాయి కోసం ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కాగా శైలజ మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు విలపిస్తున్నారు.

నకిలీ బంగారం అంటగట్టి బురిడీ

● రూ.7లక్షల నగదు, మూడు నకిలీ బంగారు బిస్కెట్లు స్వాధీనం ● ముఠా సభ్యులను అరెస్టు చేసిన హుజూర్‌నగర్ పోలీసులు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 26: నకిలీ బంగారం అంటగట్టి ప్రజలను మోసం చేసేందుకు యత్నించిన ముఠాను సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. హుజూర్‌నగర్‌లోని సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండలం మోదుగుంట్ల గ్రామానికి చెందిన నోముల ప్రకాశ్ అలియాస్ వెంకట్, నోముల మత్స్యగిరి అన్నదమ్ముళ్లు. ఆత్మకూర్(ఎం) మండలంలో ఓంసాయి ట్రేడర్స్ పేరుతో టైల్స్ వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారంలో తీవ్ర నష్టం వాటిల్లడంతో ఎలాగైనా సులువుగా డబ్బు సంపాదించాలని పల్నాడు జిల్లా రాజుపాలెంకు చెందిన కోమెర రత్తయ్య అలియాస్ తిరుపతిరెడ్డికి తెలిసిన వ్యక్తిద్వారా కలిసి రత్తయ్య, పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం మానపాలెం కాలనీకి చెందిన బత్తుల రేణు, పల్నాడు జిల్లా బెల్లంకొండకు చెందిన డేరింగుల కృష్ణవేణి, భువనగిరి-యాదాద్రి జిల్లా ఆత్మకూర్(ఎం) మండలంలోని మోదుగుండ్లకు చెందిన నోముల ప్రకాశ్ అలియాస్ వెంకటేశ్వరరావు, నోముల వెంకట్, నోముల మత్యగిరి ముఠాగా ఏర్పడి అమాయక ప్రజలను ఎంచుకుని వారికి నకిలీ బంగారాన్ని నిజమైన బంగారంగా నమ్మించి వారికి అమ్మి డబ్బులు సంపాదించుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో కోమెర రత్తయ్య, రేణుక పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో కంసలి వారి దగ్గర నకిలీ బంగారం బిస్కెట్లను తయారు చేయించారు. ప్రకాశ్, ఈ నెల 2వ తేదీన మునగాల మండలం నారాయణగూడేనికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి గోపిరెడ్డి వెంకటరెడ్డితో తమ బంధువులు కొత్త ఇల్లు కట్టాలనే ఉద్దేశంతో పాత ఇల్లు కూలుస్తుండగా రెండు బంగారు బిస్కెట్లు దొరికాయని చెప్పారు. తక్కువ ధరకు ఇప్పిస్తానని చెప్పి వ్యాపారి వెంకటరెడ్డిని మఠంపల్లి మండలం సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ మైన్స్‌కు వెళ్లే దారిలోకి తీసుకెళ్లి కోమెర రత్తయ్య నుంచి నకిలీ బంగారు బిస్కెట్లు ఇస్తామని ప్రకాశ్ చిన్నపిల్లలు ఆడుకునే కాగితపు కరెన్సీ తీసుకెళ్లి, వెంకటరెడ్డి నుంచి రూ.7లక్షలు తీసుకొని అతనికి బంగారం ఇవ్వకుండా పారిపోయారు. దీనిపై ఈ నెల 3న రియల్‌ఎస్టేట్ వ్యాపారి వెంకటరెడ్డి మఠంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మరికొందరిని మోసం చేసేందుకు యత్నిస్తుండగా..

ముఠా సభ్యులు సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెంకు చెందిన మాతంగి శ్రీను అతనికి బంగారం ఆశ చూపి హుజూర్‌నగర్‌కు రమ్మని చెప్పి శ్రీను నుంచి రూ.10వేలు తీసుకున్నారు. ఎంతకు శ్రీనుకు బంగారం ఇవ్వకపోవడంతో ఈ నెల 24న మాతంగి శ్రీను పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ రెండు విషయాలపై హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు విచారణ చేసి ఈనెల 26న నేరస్తులు జెర్రిపోతులగూడెంకు చెందిన మాతంగి శ్రీనుకు మట్టపల్లి రోడ్డులో గల భారత్ పెట్రోల్ బంక్ వద్ద డబ్బులు తీసుకుని వస్తే బంగారం ఇస్తామని చెప్పగా వారి సూచనల మేరకు గురువారం ఉదయం 11గంటలకు నోముల ప్రకాశ్, నోముల మత్స్యగిరి, మాతంగి శ్రీనులు నకిలీ బంగారంతో రాగా హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు ఆధ్వర్యంలో పట్టుకున్నారు. నిందితుల సమాచారంతో కోదాడ ఆర్కే లాడ్జిలో ఉన్న దేవరంగుల కృష్ణవేణి, బత్తులరేణుకలను పట్టుకున్నారు. వారి నుంచి రూ.7లక్షల నగదు, రెండు బైక్‌లు, ఆటో, 9సెల్‌ఫోన్లు, 3నకిలీ బంగారు బిస్కెట్లు, చిన్నపిల్లలు ఆడుకునే రూ.500ల 761నోట్లు స్వాధీనం చేసుకున్నారు.

ఎండకూ, వానకూ అవస్థలే



నిరుపయోగంగా ఉన్న నడిగూడెం బస్‌స్టాండ్

నడిగూడెం, సెప్టెంబరు 26: నడిగూడెం బస్‌స్టాండ్ ఆక్రమణలో ఉన్నా అధికా రులు పట్టించుకోవడం లేదు. జమిందారుల కాలంలో నిర్మించిన నడిగూడెం బస్‌స్టాండ్ నిరుపయోగంగా మారడంతో నడిగూడెం నుంచి కోదాడ, ఖమ్మం ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు నిలువ నీడ లేక అల్లాడుతున్నారు. గతంలో విశాలంగా ఉన్న బస్‌స్టాండ్‌లో డ్రైవర్లు ఆర్టీసీ బస్సులను సులభంగా తిప్పుకుని వెళ్లేవారు. ఈ బస్‌స్టాండ్‌ను పలువురు రెండువైపులా ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేశారు. కొందరు మాజీ ప్రజాప్రతినిధులు అక్రమంగా దుకాణాలు నిర్మించి అద్దెకు కూడా ఇవ్వడం గమనార్హం. ఆర్టీసీ సేవలు నిలిచిపోవడంతో బస్‌స్టాండ్ ఆటోల పార్కింగ్‌కు, ఆకతాయిలకు అడ్డాగా మారింది. బస్‌స్టాండ్‌లో ఆక్రమణలను తొలగించాలని రెవెన్యూ, పంచాయతీరాజ్, ఐబీ శాఖల అధికారులు కబ్జాదారులకు నోటీసుల ఇచ్చినా స్పందిండంలేదు. జాతీయ రహదారి 65నుంచి ఖమ్మం జిల్లా సరిహద్దు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించే సహసాన్ని పాలకులు, అధికారులు చేయలేకపోతున్నానే విమర్శలు ఉన్నాయి. బస్‌స్టాండ్ పక్కనే చౌదరి చెర్వు కట్టను కొందరు ఆక్రమించి ఏకంగా ఇళ్లనే నిర్మించుకున్నారు. సంబంధిత అధికారులు స్పందించి జమిందారుల కాలంలో నిర్మించిన బస్‌స్టాండ్‌ను ఆక్రమణల బారి నుంచి కాపాడి, వినియోగంలోకి తేవాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందిగా ఉంది

నడిగూడెం బస్‌స్టాండ్ నుంచి కోదాడ ఖమ్మంకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. ఇరువైపులా దుకాణదారులు ఆక్రమించుకోవడంతో ఇరుకుగా మారింది. ఎండకు, వానకు బస్‌స్టాండ్‌లో తలదాచుకోవడానికి వీలులేకుండా ఉంది.. జమిందారుల కాలం నిర్మించిన పురాతన రేకుల షెడ్డు వర్షానికి కురుస్తోంది. బస్టాండ్‌లో ఆక్రమణలు తొలగించి ప్రయాణికుల సమస్యలను పరిష్కరించాలి

●నాగేశ్వరరావు, బృందావనపురం

ఆక్రమణలపై అధికారులకు నివేదిక పంపాం

నడిగూడెం బస్‌స్టాండ్‌తోపాటు మండల వ్యాప్తంగా అనేక ఆక్రమణలు ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. కొన్ని ఏళ్ల నుంచి ఆక్రమణలు ఉన్నాయని అధికారులకు నివేదిక పంపాం. ఈ ఆక్రమణల విషయాన్ని ఇటీవల వరద ప్రాంతాల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే పద్మావతి దృష్టికి తీసుకువెళ్లాం.

●సయ్యద్ ఇమాం, ఎంపీడీవో

అంధకారంగా జాతీయ రహదారి కూడళ్లు

▸▸ అలంకారప్రాయంగా హైమాస్ట్ లైట్లు ▸▸ ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు


మద్దిరాల, సెప్టెంబరు 26: మద్దిరాల మండల కేంద్రం మీదుగా వెళుతున్న 365వ జాతీయ రహదారిలో ఏర్పాటు చేసిన ఐమాస్ట్ లైట్లు అలంకారప్రాయంగా మారాయి. మద్దిరాల మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలి, ఎర్రపహాడ్ ఎక్స్ రోడ్డు వద్ద కూడా కూడలి ఉంది. ఈ జాతీయ రహదారి కూడళ్ల నుంచి నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, ఖమ్మం జిల్లాల ప్రజలు నిరంతరం ప్రయాణిస్తుంటారు. ఐదేళ్ల క్రితం మద్దిరాల మండల కేంద్రంలో లక్షలాది రూపాయలు వెచ్చించి, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. అవి వెలగనందున కూడళ్ల వద్ద అంధకారం నెలకొంది. హైమాస్ట్ లైట్లు వెలగనందున రాకపోకలు సాగించే వాహనదారులకు ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు సూచిక బోర్డులు లేనేందున వాహనదారులు తికమక పడుతున్నారు. అధికారులు స్పందించి ఐమాస్ట్ లైట్లను వినియోగంలోకి తీసుకురావడంతో పాటు ప్రధాన కూడళ్లలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

లైట్లు వెలిగేవిధంగా చొరవ తీసుకోవాలి



మద్దిరాలలో ఏర్పాటు చేసిన ఐమాస్ట్ లైట్లు అలంకారప్రాయంగా ఉన్నాయి.. 365జాతీయ రహదారిపై ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన ఐమాస్ట్ లైట్లు వెలిగే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలి. దీనికి తోడు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. సూచిక బోర్డులు లేనందున వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

●తోట సత్యనారాయణ, గుమ్మడవెల్లి గ్రామం



మద్దిరాలలోని 365జాతీయ రహదారిపై వెలగని హైమాస్ట్ లైట్లు

20ట్రాక్టర్ల ఇసుక డంప్ సీజ్

మోతె, సెప్టెంబరు 26: అక్రమంగా నిల్వ చేసిన 20 ట్రాక్టర్ల ఇసుక డంపును అధికారులు సీజ్ చేశారు. 'ఇసుక మాయాజాలం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన వార్తకు మోతె తహసీల్దార్ సంఘమిత్ర, పెన్‌పహాడ్ తహసీల్దార్ లాలునాయక్, ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి సిబ్బందితో కలిసి గురువారం తనిఖీలు చేశారు. నర్సింహాపురం, తుమ్మగూడెం, రాయికుంటతండా, ఉర్లుగొండ, నేరేడువాయి, రంగాపురం తండా గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. రాయికుంట తండాలో 30 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను గుర్తించి సీజ్ చేశారు. ఈ డంపు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అనుమానితులపై పోలీసులకు ఫిర్యాదు

ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 26: మండలంలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన పల్ల వెంకట్‌రెడ్డి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించిన అనుమానితులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్‌రెడ్డి, కమలమ్మ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా.. ఇద్దరు వ్యక్తులు ముసుకువేసుకుని ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి వెంకటరెడ్డి దంపతులను ఇంటి పక్కకు తీసుకువెళ్లారు. అదే సమయంలో కుటుంబ సభ్యులు మేల్కొని గట్టిగా కేకలు వేయడంతో ఇంటి చుట్టుపక్కల వారు వచ్చారు. దీంతో అనుమానితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఘటనా స్థలాన్ని సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి పరిశీలించారు. వెంకట్‌రెడ్డి భార్య కమలమ్మ ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నీటి పంపిణీపై సిబ్బందికి అవగాహన ఉండాలి

మోతె, సెప్టెంబరు 26: గ్రామాల్లో నీటి పంపిణీపై సిబ్బంది అవగాహన ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అరుణాకర్‌రెడ్డి అన్నారు. చివ్వెంల, మోతె మండల పరిధిలో ఉన్న గ్రామాల సిబ్బందికి మోతె మండల పరిషత్ కార్యాలయంలో నీటి వినియోగం, నీటి సరఫరా, మోటార్ల పనితీరు, పంపుల వనియోగంపై గురువారం అవగాహన కల్పించి మాట్లాడారు. నీటిని వృధా చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ పాండు, ఎంపీడీవో ఆంజనేయులు, ఏఈలు మణికంఠ, రుత్విక్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పంట రుణాలు మాఫీ

తుంగతుర్తి, సెప్టెంబరు 26: మండల కేంద్రంలో పీఏసీఎస్‌లో పంట రుణాలు తీసుకున్న అర్హులందరికీ రుణాలు మాఫీ అయ్యాయని డీసీసీబీ డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో జరిగిన మహాజన సభలో పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో సొసైటీ సీఈవో వందనపు వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు కేతిరెడ్డి రవీందర్‌రెడ్డి, భిక్షంరెడ్డి, మజీద్, పులుగుజ్జ యాకయ్య, పెండెం యాదగిరి, చాంప్లా నాయక్, ఈదప్ప, ఎడ్ల మల్లయ్య, రామనర్సమ్మ, పూలమ్మ, సిబ్బంది యాదగిరి, ఉమేష్, మహేష్, రైతులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 26: నేటి తరం తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు రజక సంఘం నాయకులు అన్నారు. ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా కోదాడల రజక సంఘం ఆధ్వర్యంలో మునిసిపాలిటీ కార్యాలయానిక ఎదురుగా ఉన్న ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పొనుగోటి కోటయ్య, సట్టు ఎల్లయ్య, నరేందర్,నాగేశ్వరరావు, కోటయ్య, స్వామి పాల్గొన్నారు.

● ఐలమ్మ స్ఫూర్తితో ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రభుత్వంపై పోరాడుదామని బీఆర్ఎస్ కోదాడ పట్టణ అధ్యక్షుడు షేక్ నయీం, పైడిమర్రి సత్తిబాబులు అన్నారు. కోదాడలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించి మాట్లాడారు.

● కోదాడలోని కేఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఐలమ్మ జయంతి కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.రమణారెడ్డి, అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

●సూర్యాపేట, చివ్వెంల, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, పాలకవీడు, తుంగతుర్తి, తిరుమలగిరి, అర్వపల్లి మండలాల్లో ఐలమ్మ చిత్రపటాలకు, విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ధూళిపాళ ధనుంజయనాయుడు కందగట్ల అనంతప్రకాష్, తిరుమలగిరి మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ, ఇందిరాల నర్సయ్య, సంపత్‌రెడ్డి, సట్టు నాగయ్య, సంతోష్‌కుమార్, దామెర శ్రీనివాస్, గుండగోని రాములుగౌడ్, కొదమగుండ్ల నగేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



కోదాడలో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి



గురుకుల పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సామేలు

అర్వపల్లి, సెప్టెంబరు 26: విద్యార్థులను నాణ్యమైన బోధనను అందించాలని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. జాజిరెడ్డిగూడెం అరవిందాక్ష కళాశాల అద్దె భవనంలో కొనసాగుతున్న గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే సామేలు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.వంటగదిలోకి వెళ్లి ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులను మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందజేయాలని సూచించారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడి పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారో తెలుసుకున్నారు. జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపాడు గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో గురుకుల పాఠశాల నిర్మిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ, సుంకరి జనార్దన్, వలమల్ల జయాకర్, దాసరి శ్రీనివాస్, గుడిపెల్లి మధుకర్‌రెడ్డి, మహారాజు, వెంకటేష్, కృష్ణ, రవి, కొంపెల్లి మల్లారెడ్డి పాల్గొన్నారు.

వాహనదారులకు వంతెన అందుబాటులోకి..



ఇటీవల కురిసిన వర్షాలకు ధ్వంసమైన వంతెన



తాత్కాలిక మరమ్మతులు అనంతరం రాకపోకలకు సిద్ధమైన వంతెన

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తుంగతుర్తి-వెలుగుపల్లి రోడ్డు మధ్య ఉన్న వంతెన తీవ్రంగా దెబ్బతింది. ఈ వంతెనపై నుంచి వాహనాలు, ప్రజలు వెళ్లాంటే ఇబ్బంది పడేవారు. అధికారులు స్పందింది వంతెనపై రోడ్డును గ్రామ పంచాయతీ నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేయించారు. దీంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు తొలిగాయి.

● తుంగతుర్తి

ఎంఈవోలుగా బాధ్యతల స్వీకరణ

మునగాల రూరల్, సూర్యాపేట, మేళ్లచెర్వు, సెప్టెంబరు 26: ఎంఈవోలుగా పలువురు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మునగాల ఎంఈవోగా పిడతల వెంకటేశ్వర్లు, సూర్యాపేట ఎంఈవోడా సోలిపేట పాఠశాల హెచ్‌ఎం శేషగాని శ్రీనివాస్‌గౌడ్ మేళ్లచెర్వు ఎంఈవోగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం కాకుమాను వెంకటరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

వరద బాధితులకు నష్టపరిహారం అందించాలి

నేరేడుచర్ల, సెప్టెంబరు 26: వరద బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించి మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ సురగి సైదులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు యల్లబోయిన సింహాద్రి, కత్తి శ్రీనివాసరెడ్డి, రావుల సత్యం, చిలకరాజు శ్రీను, లక్ష్మి, ఊదర వెంకన్న కొమర్రాజు వెంకట్, కొండా అంజయ్య, పద్మ, పాల్గొన్నారు.

డైవర్షన్ రోడ్డు ఏర్పాటుకు అంగీకారం



డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 26: పట్టణంలోని గోవిందాపురం చెరువు ప్రాంతంలో డైవర్షన్ రోడ్డు నిర్మించడానికి అధికారులు అంగీకరించారు. గోవిందాపురానికి చెందిన రాములు కల్వర్టు నుంచి బియ్యం మూటతో నడుచుకుంటూ వెళుతుండగా జారి కిందపడ్డాడు. దీంతో రాములకు తొంటి విరిగింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు, అధికారులు, నిరసన తెలిపి డైవర్షన్ రోడ్డును కాంట్రాక్టర్ నిర్మించాలని పట్టుబట్టారు. దీంతో అధికారులు డైవర్షన్ రోడ్డు పనులు ప్రారంభించడంతో వివాదం సద్దుమణిగింది.

'రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం'

సూర్యాపేట అర్బన్, సెప్టెంబరు 26: రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వైట్‌హౌజ్‌లో 12వార్డు పిల్లలమర్రికి చెందిన బీఆర్ఎస్ నాయకులు దామోదర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కొప్పుల వేణారెడ్డి, కోతి గోపాల్‌రెడ్డి, కక్కిరేణి శ్రీనివాస్, చింత వెంకన్న, సైదులు పాల్గొన్నారు.

టీపీటీయూ మండల కమిటీ ఎన్నిక

ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 26: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ యూనియన్(టీపీటీయూ) మండల అధ్యక్షుడిగా వై.సుభాష్‌చంద్రబోస్, ప్రధాన కార్యదర్శిగా బామర సర్దార్‌సింగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం మండల కేంద్రంలో ఆ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. మహిళా కార్యదర్శిగా మాధవి, కార్యవర్గ సభ్యులుగా శంకర్‌రావు, నిమ్మల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.



ఆత్మకూర్(ఎస్): విద్యార్థులు సైబర్ నేరగాళ్ల బారిన పడొద్దని ఎస్ఐ. వై.సైదులు అన్నారు. సైబర్ నేరాలపై మండలంలోని తుమ్మల పెన్‌ప హాడ్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం. పనునూరి వెంకన్న, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు తంగెళ్ల లక్ష్మి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ డ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సురాధ పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్: ఫార్మసీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు నూరు శాతం ఉద్యోగాలు లభిస్తున్నాయని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జయలత అన్నారు. అంతర్జాతీయ ఫార్మాసిస్టుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని వికాస్ ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన వేడుకలకు ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. కార్యక్రమంలో రాందాస్, కృష్ణయ్య. ప్రిన్సిపాల్ రమేష్, డాక్టర్ కిషోర్, పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని లింగాల గ్రామంలో ప్రజలకు పర్యావరణ పరిక్షణపై పెన్‌పహాడ్ పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సూపర్‌వైజర్ సైదులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం నసీమా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: సూర్యాపేటలో ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) జిల్లా ఐదో మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి దామోదర్ కోరారు. హుజూర్‌నగర్‌లో యూటీఎఫ్ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, గోవింద్, జనార్దన్‌రెడ్డి, కమల పాల్గొన్నారు.

● రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన అనిల్‌కుమార్‌యాదవ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, గురవయ్య, జానయ్య, రాము, వెంకన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్, మద్దిరాల: యూటీఎఫ్ హుజూర్‌నగర్ , మద్దిరాల మండలాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.సోంబాబు తెలిపారు. హుజూర్ నగర్ అధ్యక్షుడిగా అన్నెం రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా ఇందిరాల జ్యోతి, ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారిగా చిక్కుళ్ల గోవింద్‌ను ఎన్నుకున్నారు. మద్దిరాలమండల శాఖ అధ్యక్షుడిగా పల్లేటి అభివన్, ప్రధాన కార్యదర్శిగా దేవులపల్లి రమేష్, ఉపాధ్యక్షులుగా వరికుప్పల గంగరాజు, మండడి శోభారాణి, కోశాధికారిగా దార భిక్షాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి జి.వెంకటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: పట్టణంలో మండల టైలర్స్ వర్కర్స్ యూనియన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బత్తిని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బత్తిని అంజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, కనకయ్య, సైదులు, రవి, బాలకృష్ణ పాల్గొన్నారు.

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో శ్రీలక్ష్మీ నృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహిం చారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: మండల కేంద్రానికి చెందిన రిటైర్డు ఎంఈవో నలబోలు వెంకటరెడ్డి రూ.20వేలతో అందించిన ట్రాఫిక్ బోర్డులు, బారికేడ్స్‌ను ఎస్ఐ చలికంటి నరేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అక్బర్ అలీ, టీడీపీ నాయకులు కీసరి నాగయ్య, పాతకోటి లింగారెడ్డి, కందుల వెంకటరెడ్డి, రవి, కానిస్టేబుల్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

●'స్వచ్ఛతా హీ' కార్యక్రమంలో భాగంగా అధికారులు గరిడేపల్లి ఎంపీడీవో కార్యాలయం నుంచి మండల కేంద్రంలోని వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సరోజ, తహసీల్దార్ బండా కవిత మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. . ఈ కార్యక్రమంలో ఎంపీవో మౌలానా, ఏపీవో సురేష్, పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని తహసీల్దార్ జ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని ఒక ప్రైవేట్ కల్యాణ మండపంలో ఉమ్మడి మండల వ్యాప్తంగా సామూహిక పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణుకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశన, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఖాజా అస్గర్ అలీ, సీడీపీవో పారిజాతం, సూపర్‌వైజర్ వెంకటరమణ, మంగమ్మ, సరిత తదితరులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్/అనంతగిరి: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కోదాడ, బాలాజీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, అనంతగిరి మండలంలోని శాంతినగర్, గోండ్రియాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సంధ్యారాణి, ఫణికుమార్, శ్రీనివాసరావు, సుధాకర్, రామకృష్ణ పాల్గొన్నారు.

మోతె: పేదలకు సీపీఎంతోనే న్యాయం జరుగుతుందని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మట్టిపెల్లి సైదులు అన్నారు. మండలంలోని రావిపహాడ్‌లో నిర్వహించిన సీపీఎం సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ వార్డు మెంబరు కుశనపల్లి గురవయ్యతో పాటు పలువురు సీపీఎంలో చేరారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, మల్లయ్య, స్వరాజ్యం, పోతయ్య, లింగయ్య, మధు, ఈదయ్య, మల్సూర్, లింగయ్య పాల్గొన్నారు.

చిలుకూరు, అర్వపల్లి: నల్లగొండ జిల్లాలో ఒక ఎంపీడీవో, ఇద్దరు కార్యదర్శులను కలెక్టర్ సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలి పారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గడ్డికోసే యంత్రాలు, ఫాగింగ్ మిషన్లు కొనలేదని పంచాయతీ కార్యదర్శులను, ఎంపీడీవోను సస్పెండ్ చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గిరిబాబు, ఎంపీవో జగదీష్, కార్యదర్శులు పాల్గొన్నారు.

●నల్లగొండ జిల్లా గుర్రంపోడు ఎంపీడీవోని, పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేయడంతో అధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి అర్వపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పవన్, ఏపీవో ఉపేందర్, పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్, హేమారెడ్డి, మూర్తి, శిల్ప, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● చిలుకూరు మండలంలోని నారాయణపురం గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇబ్బందులు పడుతున్న బాధితులకు కోదాడ మునిసిపల్ కౌన్సిలర్ షేక్ ఇమామ్ షఫీ నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వరద బాధితులకు ప్రతిఒక్కరూ చేయూతనందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మద్దిరాల: ఉపాధ్యాయుల పెండింగ్ డీఏని వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముప్పాని కృష్ణారెడ్డి కోరారు. మద్దిరాల మండలంలోని మద్దిరాల, గోరెంట్ల గ్రామాల్లో ఉన్న జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించిన టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబానీ, బండారి శ్రీనివాస్, పుప్పాల వీరన్న, జి. సురేష్‌కుమార్, పొలిశెట్టి శ్రీనివాస్, మూరగుండ్ల నాగన్న, రమేష్, మల్లిఖార్జున్, వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.

నూతన్‌కల్: మండలంలోని అలుగునూరు గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు గుండగాని విజయ్ మాతృమూర్తి లక్ష్మమ్మ మృతి బాధాకరమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుదాకర్‌రెడ్డి అన్నారు. లక్ష్మమ్మ దశదిన కర్మ సందర్భంగా అలుగునూరు గ్రామంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు తొన్కునూరి సైదులు, పసుల అశోక్‌యాదవ్, బొల్క సైదులు యాదవ్, బంటు క్రాంతి, బంటు బద్రి, సైదులు, శ్రీను, గణేష్, శ్రీరాములు, వెంకన్న, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

నాగారం: సీపీఐ(ఎంఎల్) ప్రతిఘటన పార్టీలో సీపీఐ(ఎంఎల్) ఉత్తర తెలంగాణ జోనల్ కమిటీ పార్టీ విలీనం కావడంతో తెలంగాణ- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో సీపీఐ(ఎంఎల్) ప్రతిఘటన పార్టీ బలోపేతం కానుందని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి దొంతమల్ల రాములు ఒక ప్రకటనలో తెలిపారు.